క్లుప్తంగా

చిలకంపాడులో 'ఫ్యామిలీ డాక్టర్'



చిలకంపాడులో ఫ్యామిలీ డాక్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

గణపవరం: ఉచిత వైద్యశిబిరాలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు వంటివి నిర్వహించే సందర్భాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సూచించారు. సోమవారం గణపవరం మండలం చిలకంపాడులో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్యసేవలు, మందుల సరఫరా తీరును పరిశీలించారు. వైద్యసేవలు అందుతోన్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ సంతోష్ కుమార్‌రెడ్డి, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా కృష్ణస్వామి



కృష్ణస్వామి

దెందులూరు: దెందులూరు డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ కృష్ణస్వామిని నియమిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. కృష్ణస్వామి తహసీల్దార్ జితేంద్రను కలిసి జాయినింగ్ రిపోర్టును అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన ఉత్సవాలు



ప్రతిష్ఠించిన స్వామివారి మూలవిరాట్ విగ్రహం

కొయ్యలగూడెం: శ్రీ దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉదయం 7.15 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన ఈ ఆలయాన్ని 15వ తేదీ ప్రారంభించగా మూడు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి అన్న సమారాధన జరిపారు.

నానిని కలిసిన సుందర పాల్

కామవరపుకోట: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిన మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దాసి సుందర్‌పాల్ సోమవారం ఏలూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. పెనుమాల సంజీవరావు, అరవింద్, ఉప్పే ప్రసాద్, దాసి మోషే, పెనుమాల సంగీతరావు, దొడ్డిగర్ల నాగరాజు, సూరం జయరాజు, దాసి యాకోబు నానిని కలిసిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందాం అని పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం గురునాథరావును మర్యాదపూర్వకంగా కలిసి పోలవరం అబ్జర్వర్‌గా నియమితులైన ఆయనకు అభినందనలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన వలన ఎంపీ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజారిటీ, ఎమ్మెల్యే అభ్యర్థికి 50 వేల పైచిలుకు మెజారిటీ ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిపాటి రాజకుమార్, సీనియర్ నాయకులు కోడూరి భాస్కరరావు, కె.రాజారత్నం, ఎం.శాంతారావు, వై.మోషే, టి.బాపిరాజు, కె.జీవన్‌జ్యోతి, టి.నతానియేలు, కె.భాస్కరరావు, ఎం.సుబ్బారావు, టి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో శిలువ మార్గం

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సంఘస్తులు, మాలధారులు సోమవారం గ్రామ పురవీధుల్లో ఏసు శిలువ మార్గాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఏసుక్రీస్తు దీక్షను స్వీకరించిన భక్తులంతా ఇలా శిలువ మార్గాన్ని నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా సాయంత్రం స్థానిక చర్చిలో దీక్షాధారులంతా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం శిలువను మోస్తూ, క్రీస్తు గీతాలాపనలు చేస్తూ, వాక్యం చెబుతూ ఈ శిలువ మార్గాన్ని నిర్వహించారు. సంఘ పెద్దలు టి.ఏసురత్నం, నల్లంటి లక్ష్మణరావు, ఉండి వెంకటేశ్వరరావు, పి.నాగరాజు, ఎడ్లపల్లి గంగాధరరావు, సంఘ కాపరి పాస్టర్ ఆనందరావు, సంఘస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



భీమడోలు : విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు



పెదవేగి : పరీక్షా కేంద్రం వద్ద నెంబర్లను సరిచేసుకుంటున్న విద్యార్థులు



పెదపాడు : హైస్కూల్ వద్ద నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

ఆయా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

భీమడోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం అలస్యమైన నో ఎంట్రీ అని ప్రకటించడంతో విద్యార్థులంతా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు తెలుగు పరీక్షా ప్రారంభం కాగా 12.45 గంటలకు ముగిసింది. మండల వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో 1294 మంది విద్యార్థులకు 1200 మంది పరీక్ష రాశారు. 94 మంది గైర్హాజరయ్యారు. భీమడోలు హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ జీఎల్‌ఎన్‌వీ రాఘవన్, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ షంషూద్దీన్‌లు పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. పోలసానిపల్లికి చెందిన బాలికలను ఆర్టీసీ యాజమాన్యం పరీక్షా కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పాఠశాలకు తీసుకెళ్లారు.

నిడమర్రులో 32 మంది గైర్హాజరు

నిడమర్రు: మండలంలోని అడవికొలను, నిడమర్రు, పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో టెన్త్ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 379 మంది విద్యార్థులకు 347 మంది తెలుగు పరీక్ష రాశారని, 32 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు పుచ్చల శేషు, కె.రాంబాబులు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల పరిస్థితులను ఎస్సై ఎ.శ్రీను సమీక్షించారు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు చర్చిలు, మసీదులు, హిందూ ఆలయాల్లోని మైకులు, ఇతర శబ్ద కాలుష్యం చేసే పరికరాలను పరిమితి మేరకు వినిపించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్సై సూచించారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెదవేగిలో 87 మంది గైర్హాజరు

పెదవేగి : మండలంలో ఆరు కేంద్రాల్లో 912 మంది విద్యార్థులకు 825 మంది మాత్రమే తెలుగు పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ సీహెచ్ బుదవాస్ తెలిపారు. 87 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తుతోపాటు విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్సా సదుపాయం కల్పించామని ఎంఈఓ తెలిపారు.

పెదపాడులో 1,036 మంది హాజరు

పెదపాడు : మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 1156 మందికి 1036 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. 120 మంది గైర్హాజరయ్యారు. ఒకరిద్దరు మినహా అందరూ ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పిప్పరలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సుభాష్

గణపవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. రోజూ రేయింబవళ్లు, పలు కూడళ్లలో వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తిరిగే వాహనాలపై మరింత నిఘా పెట్టారు. పిప్పర మూడు రోడ్ల కూడలిలో అత్తిలి, భీమవరం, గణపవరం, తాడేపల్లిగూడెం వైపు వెళ్లే వాహనాలు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎంవీ సుభాష్ మాట్లాడుతూ రసీదులు, ఆధారాలు లేకుండా రూ.50 వేల పైబడి నగదు, రూ.10 వేల విలువైన బహుమతులు కలిగి ఉంటే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సీజ్ చేశామన్నారు. తగిన ఆధారాలు ఉంటేనే వెంట తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదేలు గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం: మారుమూల అటవీప్రాంతంలో జీవనం సాగిస్తున్న మోదేలు గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో బ్రిటిష్ కాలంలో ఏర్పడిన మోదేలులో 25 కుటుంబాల వరకూ ఉన్నాయి. మోదేలుకి ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగింది. అలాగే రూ.70 లక్షలు విద్యుత్ సదుపాయం కోసం మంజూరు చేశారు. అయితే అటవీ అధికారుల అభ్యంతరాలతో ఆ పనులు నిలిచిపోయాయి. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి పీఓ ప్రత్యేక చర్యలూ చేపట్టారు. దీనిలో భాగంగా మోదేలు గ్రామ గిరిజనులు లంకపాకలలో రేషన్ బియ్యం తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. మోదేలు విద్యార్థులు లంకపాకలలో చదువుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. సుమారు 10 మంది మహిళలు ఝాన్సీరాణి డ్వాక్రా సంఘం గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోగా వారిని బుట్టాయగూడెం మండలంలో రుణాలు పొందే విధంగా ఏర్పాటు చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో లంకపాకలలోనే మోదేలు గిరిజనులు ఓట్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటామని పీఓ తెలిపారు.

అప్పనవీడులో 'నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం'



అప్పనవీడులో ప్రచారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్



కైకరంలో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

పెదపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ అన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమానికి పటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జగన్‌కు ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అప్పనవీడు సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్దే రామ సీత, తదితరులు పాల్గొన్నారు.

కైకరంలో వైఎస్సార్ సీపీ ప్రచారం

ఉంగుటూరు: కై కరంలో ఎన్నికల ప్రచారం 16 రోజుకు చేరింది. వార్డు మెంబర్లు సత్తిబాబు, బగాతి అంజిబాబు, కర్రీ ముత్యాలరావులు నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, బీసీ నాయకుడు కొరిపల్లి శ్రీను, ఉపసర్పంచి మట్టామురళి, పార్టీ అధ్యక్షుడు నక్క శ్రీను, దళిత నాయకులు గంజి ప్రభాకరరావు, చిన్న అనిల్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు పేద్ద అప్పన్న, పంతులు వెంకన్న, వైఎస్ శ్రీనివాసు, కొల్లబత్తులనాగరాజు, పలువురు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి



ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ పురుషోత్తం

పెదవేగి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఉందని డ్వామా ఏపీడీ పురుషోత్తం అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో కూలీల సౌకర్యార్థం మంచినీరు, అత్యవసర మందులు, నీడ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జూలై నెలలోపు పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వేసవిని దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా పనివేళల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

దెందులూరు: రానున్న ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళా ఓటర్ల పాత్ర కీలకం కానుంది. గ్రామీణ ప్రాంత నియోజకవర్గమైన ఈ నియోజకవర్గం రాజకీయంగా, సామాజికంగా ఆది నుంచి ఎంతో చైతన్యవంతమైంది. ఈ నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్, దెందులూరు మండలాలు ఉన్నాయి. 2023-24 సంవత్సరానికి భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాను పరిశీలిస్తే దెందులూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు పురుషుల కంటే 5,840 మంది అధికంగా ఉన్నారు. పురుషుల కంటే మహిళలు ఓటర్లుగా నమోదు కావడం మహిళల చైతన్యానికి నిదర్శనం. ఈ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,08,465 మంది, మహిళా ఓటర్లు 1,14,305, ట్రాన్స్ జెండర్స్ 07 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 102, పీడబ్ల్యూజీ ఓటర్లు 2,638, నూతన ఓటర్లు 5,438 ఉన్నారు. రెండు నెలల్లో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు 239, రూట్లు 23, ఎస్ఎస్ టీమ్‌లు 4, వీడియో టీమ్స్ 4, వీడియో వివీల్ టీమ్‌లు 1, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 4, అకౌంటింగ్‌టీమ్ 1, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ టీమ్ 1, ఎంసీసీ టీమ్‌లు 4, ఆర్‌ఓ 1, ఏఆర్‌ఓ నలుగుర్ని నియమించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ, జేసీ లావణ్యవేణి



కోమర్రులో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

దెందులూరు: ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. సోమవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులతో ఆమె అత్యవసర సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. తహసీల్దార్ వి.జితేంద్ర ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాలుగు మండల అధికారులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి

గణపవరం: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని, ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగొద్దని ఎస్సై వి.వెంకటేశ్వరరావు ప్రజలకు వివరించారు. ఓటుహక్కు వినియోగంపై సోమవారం గణపవరం మండలం కోమర్రు, డికెపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల నియమావళి, ఓటుహక్కు వినియోగం, రాజకీయ పార్టీల ఒత్తిళ్లు, ప్రలోభాలపై అవగాహన కల్పించారు. అనవసర వివాదాల్లోకి వెళ్లవద్దని, ఎన్నికలు ప్రశాంతంగా సక్రమంగా నిర్వహించేందుకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాస భూములపై నిషేధం తొలగించాలి



గణపవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

గణపవరం: తమ నివాస భూములపై ఉన్న నిషేధాన్ని తొలగింలని కోరుతూ గణపవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంవద్ద సోమవారం మహిళలు ఆందోళన చేశారు. నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన మహిళలు, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ బీహెచ్ లక్ష్మికి వినతిపత్రం అందచేశారు. 1955వ సంవత్సరం నుంచి తమ 20 కుటుంబాలవారు కొనుగోలు చేసిన భూములు 2019 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయని, 2020 నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వారు నిషేధ భూములుగా చేర్చి తమ భూములపై హక్కులు లేకుండా చేశారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ వరలక్ష్మి, పొత్తూరు పద్మావతి, రుద్రరాజు రాజేశ్వరి, వేగేశ్న సుబ్బలక్ష్మి, నడింపల్లి లక్ష్మి, నాయకులు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మారెమ్మ జాతర మహోత్సవాలు



గణపవరం దండు మారెమ్మవారు

గణపవరం: గణపవరం పరిసర కొల్లేటి గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం శ్రీదండు మారెమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 19వ నుంచి ఈనెల 24వ తేదీ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయానికి రంగులువేసి, చలువపందిర్లు రంగురంగుల విద్యుత్ దీపాలంకరించారు. ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల ప్రారంభం రోజు మంగళవారం అమ్మవారి గవళ్ల గుడుపు సేవ కన్నుల పండుగగా నిర్వహించనున్నారు. అమ్మవారికి ఆసాదులు గరగల సేవ చేస్తారు. విద్యుత్ దీపాల వెలుగులు, గరగల నృత్యాలు, విచిత్ర వేషాలు, శక్తి వేషాలు, బుట్టబొమ్మలు, కోయడ్యాన్సులు, తీన్‌మార్ వాయిద్యాలు, కోరగేద నృత్యాలు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారిని రాత్రి తెల్లవార్లు గ్రామంలో ఊరేగిస్తారు. భక్తులు అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మారెమ్మవారి ఆలయానికి దాదాపు నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. పూర్వ అమ్మవారు తోటి దేవతలతో కలిసి గణపవరం మీదుగా వెళ్తున్న సమయంలో ఇక్కడి ప్రజలు పడుతున్నకష్టాలు చూసిన పాటిదిబ్బలపై మకాంపెట్టారని, ప్రజల బాగోగులు చూసుకున్నారని ఆలయ చరిత్ర చెబుతోంది. అమ్మవారి విగ్రహం వెలసినప్పటి నుంచీ గ్రామ ప్రజల కష్టాలు తీరడంతో అదంతా అమ్మవారి మహిమగా భావించి, ఏటా అమ్మవారికి జాతర చేయడం ప్రారంభించారని పూర్వీకుల చెబుతారు. ఏటా అమ్మవారికి జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించారు.

ఎస్సీ, ముస్లిం ఇఫ్తార్ విందే స్ఫూర్తి




నవాబ్ పేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్సీ, ముస్లిం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ముస్లిం ఇఫ్తార్ విందు స్ఫూర్తితో బహుజన సేన ఆధ్వర్యంలో కులాంతర, మతాంతర ఆత్మీయ విందును స్థానిక వన్‌టౌన్‌లోని నవాబ్ పేటలో సోమవారం నిర్వహించారు. బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తేబాబి ఆధ్వర్యంలో కోర్ కమిటీ రాష్ట్ర కోశాధికారి మత్తే కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. 1949లో మౌలానా హస్రత్ మోహని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కలిసి మతసామరస్యంలో భాగంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ మహనీయుల ఆశయాల కొనసాగింపుగా కుల, మతాలకు అతీతంగా బహుజన ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మతసామరస్యాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల ఏర్పాటు హర్షించదగ్గ విషయమని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబి మాట్లాడుతూ హరిద్వార్లో హిందువుల యాత్రకు స్వాగతం పలికే ముస్లిం సమాజం రాష్ట్రంలో కూడా ముందుకు రావాలని కోరారు. కులమతాలకు అతీతంగా ఏర్పడిన బహుజన సేనకు ప్రజలు అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మత్తే మల్లిబాబు, ఎ.రామకృష్ణ, ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ వాదులు మంచెల్ల ఇస్సాక్, షేక్ బాజీ, ఇర్ఫాన్, మారగాని చంద్రకిరణ్, రాజానాల సాయికిరణ్, కాపుదాసి రవికుమార్, ఎరికిపాటి విజయ్ కుమార్, షేక్ అబ్దుల్ రషీద్, పిట్టా రాహుల్, వేల్పుల సుందరం, నూకపెయ్యి కార్తీక్, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో పలువురి నియామకం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు ఏలూరు నియోజకవర్గం, ఏలూరు నగర కమిటీ, నగర అనుబంధ కమిటీల్లోకి పలువుర్ని నియమించారు. ఏలూరు జిల్లా మైనార్టీ విభాగంలోకి షేక్ సయ్యద్ బాజీ, బీసీ నగర కమిటీలోకి మేడిబోయిన కొండలరావు, కాపు నగర కమిటీలోకి మద్దాల ఫణిలను తీసుకున్నారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా బత్తుల ప్రభాకరరావు, నగర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కూచిపూడి మహేష్, సిటీ సెల్ కార్యదర్శులుగా నక్కా రమేష్, పాము శ్యామ్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా జాయింట్ సెక్రెటరీగా అరిగల రాజు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా వేమండ్ర రవికుమార్‌లను నియమించారు. కొత్తగా పదవులు పొందిన నాయకులు పార్టీ పటిష్టానికి కృషి చేయాలని బొద్దాని శ్రీనివాస్ కోరారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రతిపక్షాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): అనైతిక పొత్తులతో అధికార దాహమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పట్టని ప్రతిపక్ష పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపు నిచ్చారు. స్థానిక 11వ డివిజన్ దక్షిణపు వీధి పోణంగి మహాలక్ష్మి అమ్మవారి గుడివద్ద అడ్డూరి శేఖర్ ఇంటి వద్ద సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాని పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలు ఆర్థికంగా శక్తివంతులను చేసే విధంగా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించిన గొప్ప సీఎం జగన్ అని కొనియాడారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇదే సందర్భంగా గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కోరారు. రెండోసారి సీఎంగా జగన్‌ను గెలిపించుకునే విధంగా కలిసికట్టుగా ముందుకు సాగుదామని నాని పిలుపు నిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ కోయ జయగంగ సత్తిబాబు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.